ఆరోజెల్లా నాకూ, నాపిల్లలికీ, పిల్లలతల్లికీ గంజినీళ్లులేవు. పిల్ల లాకలోపుని గోలెడుతున్నారు. ఏడిచీవినప్పుడల్లా ఇన్నిమంచినీళ్లు పోస్తోంది మాకామి పిల్లలకి. ఎల్లాగో అల్లాగ పేమంవరం ముడిచి పెట్టుకు తొంగున్నాము.

మున్నాడు వారెడు పొద్దెక్కాక కామందింటికి వెళ్లాను. "పిల్లలు గోలెట్టేస్తున్నారు బాబయ్యా? పోనీ వరకా, కళ్లం, లేక పోతే మానె మాకియ్యాకలిగిన జీతం గింజలేనా యియ్యండి! గంజి గాచుకు తాగుతాం బాబూ! రచ్చించండి" అన్నాను. "ఛీ లెంపదనకొడకా! ఇక్కడ జీతం గింజలు గాచపెట్టుకు కూచున్నామా? లేవుపో! పైనెల్లోగాని నీకు ఒంటిగింజ యివ్వను. పో దొంగలంజ కొడకా!" అని గదిమాడు పెద్దకామందు, చిన్నకామందూను.

నాకేం తోయ్యలేదు. ఇంట్లో పిల్లలసంగతి తల్చుకుంటే గుండె తరుక్కుపోయి ఏడుపొచ్చి కింద నేల గడిసి పోతోంది.

కామందు అల్లుడుగారూ, అరిబలిగాళ్ళు "కాపీలు" తాగి ఆడేదో బల్ల ఆడుకోడానికి యిూగదిలోకి వచ్చారు. దొడ్డిగుమ్మ ముంట చిన్న కాఫుచెల్లి అమ్మగారు పెరుగుమూతలెట్టుకుని అవిడికి గిన్నెలు చెల్లించిపోతున్నారు. ఊళ్ళో బాపన్లపిల్లలు. ఉత్తపుస్తెన్ని మాపిల్ల తాగంటే పాలుతాగిందని మానోటికాడి గంజి లాగేశాడు కాపు. ఇంటికొచ్చిన పాలన్నీ తాగినన్ని తాగి మిగిలినవన్నీ తోసి డబ్బుచేసుకుంటున్నారు కామందులా గంగలు. కష్టపడి పనిచేసుకునే మాబోటి పేదవాళ్ళగంజి, సిబ్బులంతాగే పాలమూలాన్ని లేకపోయింది. ఏడనాయిను దేముడాయిడి! అనుకున్నాను. కామందులు బడీమని తలుపులేసుకున్నారు. నాకు పాణంసాలొచ్చి అక్కడేపడిపోయాను. నాకళ్ళముందు నాగుడిసీ, అలాసుని యేడుస్తున్న పెళ్ళామూ, బిడ్డలూ, కనపడ్డాయి.

---

# నిజాంరాష్ట్రమూ—మన ఆంధ్రులున్నూ

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౪

## ఆబ్ పాషీ

అంటే ఇరిగేషను పనులు చూసే శాఖ. చెరువులూ, కాలవలూ త్రవ్వించడమూ, నదులకు ఆనకట్టలు కట్టడమూ వ్యవసాయపుపనులకూ, జనులు వాడుకోడానికీ నీరు సప్లయి చెయ్యడమూ, రోడ్లూ, భవనాలూ నిర్మించడమూ మరమ్మత్తులు చెయ్యడమూ యీశాఖపనులు. దీనిని తామీరాత్—అంటే నిర్మాణశాఖ నిర్వహిస్తుంది.

౧౩౪౨ వ ఫసలీనాటికి రాష్ట్రం అంతటికీ ౪౧౭౧ మైళ్ళ రోడ్లు నిర్మించబడినవి.

౧౯౨౧—౩౧ సంవత్సరాల మధ్యకాలంలో, యీశాఖ, తెలంగానాలో యీకింది జలాశయాలు (ప్రాజెక్టులు) నిర్మించింది.

౧. పోచవరం ప్రాజెక్టు.

ఇది మెదకు జిల్లాలో ఆలేరునది కడ్డంగా కట్టబడ్డది. ౩౨ లక్షల రూపాయలు ఖర్చయినవి. ౨౬ మైళ్ళ పొడుగున కాలవ త్రవ్వబడినది. ౧౩ వేల యకరములలో వరిపంటకు నీరు అందించగలదు.

౨. పాలేరు ప్రాజెక్టు.

వరంగల్లు జిల్లాలో పాలేరు నదిమీద కట్టబడ్డది. కట్టమెత్తు ౬౨ అడుగులు. ౨౪ లక్షల ఖర్చుతో తయారైనది. ౨౦ వేల యకరాలలో వరిపంటకు నీరు అందించగలదు.

౩. వైర ప్రాజెక్టు.

ఇదిన్ని వరంగల్లు జిల్లాలోదే. వైర అనే నదిమీద కట్టబడ్డది. కట్టమెత్తు ౬౧ అడుగులు, ౩౧ లక్షల పైచిలుకుతో తయారైనది. ౧౭౫౦౦ యకరాలలో వరి చెరుకుపంటలకు నీరందించగలదు.

౪. ఫతేనగరు ప్రాజెక్టు.

మెదకు జిల్లాలోది. గంగాపూరు ఆనకట్టనుంచి మంజీరానది యెడమగట్టె నిర్మించబడ్డ కాలువ యిది. ౬ లక్షల ఖర్చుతో తయారైనది. ౫౪౦౦ యకరాల వరిపంటకు నీరందించగలదు.

౫. నిజాం సాగరు ప్రాజెక్టు.

నిజామాబాదు జిల్లాలోది. మంజీరానదిమీద కట్టబడ్డది. ౪ కోట్ల ౨౬ లక్షల వ్యయంతో తయారైనది. దీనిలోనుంచి ౭౨ న్నర మైళ్ళ పెద్ద కాలవా, ౫౨౫

స్పెళ్ళ పిల్లకాలవలూ తీయబడి ఎల్లారెడ్డి, బోధన్, నిజా మాబాదు, ఆర్మూరు తాలూకాలలో ౭ లక్షల ౭౬ వేల యకరాలలో వరిపంటకు నీరందించుచున్నవి.

ఇవి కాక :

వరంగల్లు జిల్లాలో సింగభూపాలం చెరువూ మెదకు జిల్లాలో రాయునపల్లి చెరువూ, నిజామాబాదు జిల్లాలో సింగటం చెరువూ నిర్మించబడ్డవి. వీటికి ౧౧ లక్షల రూపాయలు ఖర్చయినవి.

## లోకల్ బోర్డులు—మునిసిపాలిటీలు

ఇవి రెవెన్యూశాఖ అధీనంలో వున్నవి. ప్రతి తాలూకా కున్నూ వొక తాలూకాబోర్డూ, ప్రతీజిల్లాకూ వొక జిల్లాబోర్డూ ఏర్పరచబడివున్నవి. తాలూకాబోర్డుకు తహసీల్దారున్నూ, జిల్లాబోర్డుకు కలెక్టరున్నూ అధ్యక్షులు. డివిజనల్ అధికారి వున్నచోట తహసీల్దారుకి బదులు తాలూకాబోర్డుకు అతనే అధ్యక్షుడు.

వీటి సభ్యులలో అధికారులూ అనధికారులూ కూడా వుంటారు; కాని అనధికారులను ప్రజలు ఎన్నుకోడాని కేర్పాట్లు లేవు. సర్కారే నామినేటు చేస్తారు.

రు ౧ కి వొక అణా చొప్పున భూమి పన్ను ననుస రించి లోకల్ ఫండు వసూలు చెయ్యబడుతోంది.

౧౩౪౨ ఫసలీలో వసూలైన లోకల్ ఫండు మొత్తం ౧౦,౭౫,౫౩౬ రూపాయలు.

రాష్ట్రంలో వున్న పెద్దపెద్ద పట్టణాలను లోకల్ బోర్డులలోనుంచి విడదీసి వాటికి మునిసిపాలిటీ లేర్పరి చారు. ఇంటిపన్నూ, వెలుతురుపన్నూ, టోలుగేటు పన్నూ—ఇవీ వీటి ఆదాయం పద్దులు.

జిల్లాబోర్డుల ఆదాయంలోనుంచి ౧౩% కూడా వీటి కిస్తారు.

## సఫాయి

బ్రిటిషురాష్ట్రాలలో రాజధానీనగరాల కున్నట్టే నిజాం రాజధానీనగర మైన హైదరాబాదుకున్నూ ప్రత్యేకాధి కారాలతో కార్పొరేష నున్నది. ఆరాష్ట్రంలో దీనిని "సఫాయి" అంటారు.

మొన్నటిదాకా దీనికి ఎన్నికల పద్ధతి యేర్పడ లేదు. ఇటీవలే అది వొక ప్రత్యేకశాసనం ద్వారా యేర్పడ్డది.

దాని ననుసరించి నగరం వార్డులుగా విభజించబడ్డది. వార్డు కొక సభ్యు డెన్నుకోబడతాడు.

నెల ౧కి ౭-౦-౦ పన్ను విలువ గల యిల్లు గల వారూ, గ్రాడ్యుయేట్లూ, వర్తకులూ, జాగీర్దారులూ వోటర్లు.

ఇప్పుడు సఫాయి సభ్యుల వివరా లిలా వున్నవి.

| | |
|---|---|
| ౧. జనులచే యెన్నుకోబడ్డవారు | ౧౩ |
| ౨. గ్రాడ్యుయేట్లవల్ల యెన్నుకోబడ్డవారు | ౧ |
| ౩. వర్తకుల పక్షంగా యెన్నుకోబడ్డవారు | ౧ |
| ౪. జాగీర్దారుల పక్షంగా యెన్నుకోబడ్డవారు | ౨ |
| ౫. పాయిగాల పక్షంగా యెన్నుకోబడ్డవారు | ౩ |
| ౬. పేష్కారీ పక్షాన | ౧ |
| ౭. సాలార్జంగు స్టేటుపక్షాన | ౧ |
| ౮. సర్కారుచే నామినేటు చెయ్యబడ్డవారు | ౧౩ |
| ౯. అధ్యక్షుడు (నామినేటెడు) | ౧ |
| ౧౦. సర్ఫెఖాసుపక్షాన (నామినేషను) | ౧ |
| ౧౧ ఆదిహిందువుల పక్షాన (నామినేషను) | ౧ |
| ౧౨. పార్సీల పక్షాన (నామినేషను) | ౧ |
| ౧౩. క్రైస్తవుల పక్షాన (నామినేషను) | ౧ |

సఫాయి తీర్మానాలు అమలుజరపడానికి కమిషన రున్నాడు.

## విద్యాశాఖ

రాజ్యాంగంలో ఇది చాలా ముఖ్యమైన శాఖ. నైజాముగారున్నూ దీనివిషయమై కొంత శ్రద్ధ కన పరుస్తున్నారు.

విద్యాశాఖాధికారికి నాజిం అని పేరు. అంటే డైరక్ట రన్నమాట. ఇతని కింద ఒక్కొక్కసుబా కొక్కొక్క సదర్ మొహతెమిమూ, ప్రతీజిల్లాకూ వొక్కొక్క మొహతెమిమూ వున్నారు. మొహతెమీము కింది అధి కారి నాజిర్.

సంవత్సరానికి రమారమి ఒక కోటి రూపాయలు శిక్షణకోసం ఖర్చుపడుతున్నవి. ౧౩౪౨ న ఫసలీలో వొక కోటి ఆరులక్షల ఖర్చయినవి. అయినా నైజాము రాష్ట్రంలో నూటికి అయిదుగురు మాత్రమే అక్షరాస్యు లున్నారు.

దీనికి కారణం ప్రయివేటు పాఠశాలల నిషేధం. ప్రభుత్వంవారు ఈనిషేధం చాలా నిక్కచ్చిగా అమలు పరుస్తున్నారు.

ఈనిషేధం లేకపూర్వం ౧౩౩౩ ఫసలీలో ప్రయివేటు పాఠశాలలు ౪౦౫౩ న్నూ, వాటిలో చదువుకునే పిల్లల సంఖ్య ౭౬౬౫౪ న్నూ వుండేది. ఈనిషేధం రావడం వల్ల, తరవాత ఏడు సంవత్సరాలకు, అంటే ౧౩౪౨ ఫసలీలో ఆపాఠశాలలసంఖ్య ౭౭౬ టికిన్నీ, వాటిలో చదువుకునే విద్యార్థుల సంఖ్య ౨౭౫౦౬ టికిన్నీ పడిపోయింది.

ఈ సంఖ్యలు రోజురోజూ యిలాగ పడిపోతూనే వున్నవి. దీనివల్ల రాష్ట్రంలో దేశభాషలు—అంటే తెనుగు, మరాటీ, కన్నడభాషలు దిగనారిపోతున్నవి.

ఒక్కొక్కప్పుడు దేశభాషల నాశనానికే పుట్టిందా అన్నంత అసహ్యంగా వున్నది యీ నిషేధం.

ఈకింది అంకెలు చూస్తే నైజాం రాష్ట్రంలో విద్య యెంత హీనంగా వుందో బోధపడుతుంది.

| రాష్ట్రం | అక్షరాస్యులు (నూటికి) |
|---|---|
| బ్రిటిషురాష్ట్రాలు | |
| ౧. బంగాళా | ౧౧.౧ |
| ౨. మద్రాసు | ౧౦.౯ |
| ౩. సి. పి. బీరార్లు | ౬.౬ |
| ౪. బొంబాయి | ౧౦.౮ |
| స్వదేశసంస్థానాలు | |
| ౧. కొచ్చిన్ | ౩౩.౭ |
| ౨. తిరువాన్కూరు | ౨౮.౯ |
| ౩. బరోడా | ౨౦.౯ |
| ౪. మైసూరు | ౧౦.౬ |
| ౫. నైజాం | ౫.౦ |
| ౬. కాశ్మీరం—జమ్ము | ౪.౦ |

రమారమి ౯౦ లక్షలు మాత్రమే ఆదాయం గల కొచ్చిన్‌సంస్థానం మొదటిది కావడమూ, ౮ కోట్లు పైచిలుకు రాబడిగల నైజాంరాష్ట్రం వెనకబడి పోవడమూ లజ్జాస్పదం అనక తప్పదు.

మతాలను బట్టి నైజాం రాష్ట్రంలో అక్షరాస్యుల సంఖ్యలు ఇలా వున్నవి.

| మతం | అక్షరాస్యులు (నూటికి) |
|---|---|
| ౧ సవర్ణహిందువులు | ౪.౮ |
| ౨ అవర్ణహిందువులు | .౭ |
| ౩ ఆర్యసామాజికులు | ౧.౨ |
| ౪ బ్రహ్మసామాజికులు | ౭౩.౧ |
| ౫ జైనులు | ౨౦.౨ |
| ౬ సిక్కులు | ౩౫.౭ |
| ౭ ముసల్మానులు | ౧౨.౪ |
| ౮ క్రిష్టియనులు | ౧౭.౧ |
| ౯ పార్సీలు | ౯౪.౦ |
| ౧౦ బౌద్ధులు | ౫౭.౮ |
| ౧౧ యూదులు | ౭౯.౨ |
| ౧౨ అడవిజాతులు | .౬ |
| ౧౩ అన్నిజాతుల మొత్తంమీద | ౫.౦ |

## ఉస్మానియావిశ్వవిద్యాలయం

నైజాముగారు ప్రసాదించిన ఫర్మానా (Royal charter) ద్వారా ౧౯౧౮ అక్టోబరు ౫ వ తేదీని (౧౩౨౭ ఫసలీ ఆబాన్. ౧౭) ఇది నెలకొల్పబడ్డది.

దీనికి కౌన్సిల్ అనే పేరితో వొక కార్యనిర్వాహక సంఘం వున్నది. ఇందులో ౯ మొదలు ౧౧ గురు సభ్యు లుంటారు. వీరందరూ ప్రభువువల్ల నియమించ బడ్డవారే.

విద్యాబోధనకు సంబంధించిన విషయాలు చూడడానికి సెనేటున్నది. ఇందులో ౪౦ మొదలు ౬౦ వరకున్నూ సభ్యులుంటారు. వీరున్నూ నియమించబడ్డ వారే.

సెనేటు వ్యవహారాలు నిర్వహించడానికి సిండికేటు న్నది. ఇందులో ౫ మొదలు ౭ గురు సభ్యు లుంటారు. వీరు సెనేటర్లలోనుంచి నియమించబడ్డవారు.

బోధనపద్ధతి నిర్ణయించడానికి ఫాకల్టీ కూడా వున్నది.

అయితే: బ్రిటిషురాష్ట్రాలలో విశ్వవిద్యాలయాలు ప్రజలవల్ల ఎన్నుకోబడిన సభ్యుల ద్వారా నిర్వహించ బడుతుండగా నైజాముగారి ఉస్మానియా విశ్వవిద్యాలయం నామినేటెడ్డు మెంబర్లవల్ల నిర్వహించబడు తున్నది.

నిజం చెప్పవలసివస్తే నైజాము విశ్వవిద్యాలయమే కాక మన బ్రిటిషురాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు కూడా నిర్ధూమధామంగానే వున్నవి. వీటిలో ప్రజాప్రాతినిధ్యం వ్యర్థం అయిపోతున్నది. విద్యాధికత వుపయోగపడడం లేదు.

బ్రిటిషురాష్ట్రీయవిశ్వవిద్యాలయాలలో రాజకీయాల కంపు పేరుకుపోయి వున్నది. దీనివల్ల అనేకాపభ్రంశాలు జరుగుతున్నవి. దీన్నిబట్టి చూస్తే నైజాంవిశ్వవిద్యాలయం అధికారుల చేతిలో వున్నందుకు ఆక్షేపించవలసిన అగత్యం కనపడదు.

అయితే: ఒక భేదం మాత్రం వున్నది.

బ్రిటిషురాష్ట్రీయవిశ్వవిద్యాలయాలు ఏమీ చెయ్యలేకపోతున్నవి. రోజులు గడుపుకోగలగడమే వాటికి చేతనైన పని.

ఇక నైజాం విశ్వవిద్యాలయం దేశీయులకు చాలా అపకారమే చేస్తున్నది.

అందులో మహమ్మదీయవిజ్ఞానానికే ప్రాధాన్యం, ఉర్దూలోనే సర్వమూ బోధించబడుతుంది. దేశభాషలైన ఆంధ్రమహారాష్ట్రకర్ణాటకాలకు అది చాలా అపకారం చేస్తున్నది.

నిజానికి, మనకు, విద్యాబోధ ఇంగ్లీషులో జరిగితే యెంతో ఉర్దూలో జరిగినా అంతే. రెండూ కూడా విద్యార్థుల కాలమూ, మెదడూ దుర్వ్యయం చేసేవే.

అయితే: తారతమ్యపరీక్ష చేస్తే ఒక విధంగా ఇంగ్లీషే అంగీకరించవచ్చు; కాని వుర్దూ అంగీకరించడానికి వీలులేదు.

ఏమంటే?

ఇంగ్లీషు భాతికాలకు సంబంధించిన సకలవిషయాలలోనూ సంపన్నమై వుంది. ఆవిషయాలు వుర్దూలో నేమీ లేవు.

వుర్దూ భారతీయులలో మహమ్మదీయులైనవారికి సామాన్యభాష. అంతే. అందులో భౌతికవిజ్ఞానం యేమీ లేదు. ఇప్పుడిప్పుడు ఇంగ్లీషుగ్రంథాలు వుర్దూలోకి భాషాంతరీకరించబడుతున్నవి. ఇందుకోసం నైజాం ప్రభువు లక్షలకొద్దీ డబ్బు ఖర్చుపెడుతున్నారు.

ఇలాగ వుర్దూను సంపన్నం చెయ్యడమే వారి అభిలాష. తమ మాతృభాషకు ఉన్నతి కలిగించడమే వారి వుద్దేశం.

కాని అవి యెంతమాత్రమూ నెరవేరవు.

ఎందుచేతనంటే అలా మార్చబడుతున్న ఇంగ్లీషు గ్రంథాలు స్వతంత్రాలు. వాటిని రచించినవారు విషయం తెలుసుకుని, విశిష్టత సంపాదించుకుని కొంత అభివృద్ధి కనపరుస్తూ వాటిని రచించివున్నారు. వాటిని వుర్దూలోకి మారుస్తున్నవారి కలాంటి యోగ్యత లున్నవని చెప్పడానికి వీలు కనపడదు. అందుచేత ఆవుర్దూ గ్రంథాలవల్ల విద్యార్థుల మెదడు కరిగిపోవడం తప్ప మరేమీ ప్రయోజనం కలగదు. ఆపాతపుస్తకాల అనువాదాల్లో నేటి అభివృద్ధులు చేరవుకనక, విద్యార్థులు బాగుపడరు.

కాని యేమిటి చెయ్యడం?

ప్రభువు నిరంకుశులు.

ఎవరేం చెప్పినా ప్రయోజనం లేదు.

ప్రజలవల్ల ఎన్నుకోబడ్డవారే మన విశ్వవిద్యాలయాలలో కేవలనిరంకుశత కనపరుస్తూ వుంటే సర్వసమర్థులూ నిరంకుశులూ అయిన నైజాముగారిని ఇక అనవలసిన దేమున్నదీ?

ఈ ఉస్మానియావిశ్వవిద్యాలయం యేర్పడ్డ ౧౫ సంవత్సరాలకు ౧౩౪౨ ఫసలీలో నిజాంరాష్ట్రంలో విద్యా విషయాలు ఇలా వున్నవి.

| విద్యాసంస్థలు | | ఖర్చు |
|---|---|---|
| ౧. కాలేజీలు. | | |
| ౧. ఇంజనీరింగుకాలేజీ | ౧ | |
| ౨. మెడికల్ కాలేజీ | ౧ | |
| ౩. స్త్రీలకాలేజీ | ౧ | |
| ౪. ఆర్ట్సుకాలేజీలు | ౬ | |
| ౫. లాకాలేజీ | ౧ | |
| ౬. నోబుల్ కాలేజీ | ౧ | ౧౧,౫౬,౭౫౦ |
| ౨ హైస్కూళ్లు | ౫౦ | ౧౫,౮౨,౦౮౨ |
| ౩ మిడిల్ స్కూళ్లు | ౧౨౯ | ౧౦,౮౧,౫౯౩ |
| ౪ ప్రయిమరీస్కూళ్లు | ౪౨౬౦ | ౨౪,౨౮,౯౭౧ |
| ౫ స్పెషల్ స్కూళ్లు | ౬౨ | ౩,౮౪,౧౧౪ |

౧౩౪౨ ఫసలీలో విద్యార్థుల సంఖ్యలు

| విద్యాసంస్థలు. | సంఖ్య | బాలురు | బాలికలు |
|---|---|---|---|
| ౧ కాలేజీలు | ౧౦ | ౧౪౨౭ | ౨౨ |
| ౨ హైస్కూళ్లు | ౫౦ | ౬౪౨౧ | ౨౩౯ |
| ౩ మిడిల్ స్కూళ్లు | ౧౨౯ | ౧౪,౨౭౭ | ౮౧౬ |
| ౪ ప్రైమరీస్కూళ్లు | ౪౨౬౦ | ౨,౫౬,౬౨౩ | ౫౨,౩౦౫ |
| ౫ స్పెషల్ స్కూళ్లు | ౬౭ | ౩,౮౯౯ | ౧,౧౨౯ |

టెక్స్టుబుక్కు కమిటీ

మన విశ్వవిద్యాలయాలకు లాగే ఉస్మానియావిశ్వవిద్యాలయానికిన్నీ పాఠ్యగ్రంథాలు నిర్ణయించే కమిటీ వున్నది. ఈ కమిటీ మెంబర్లు నామినేషను వల్ల వచ్చిన వారే కాని ఎన్నుకోబడ్డవారు కారు. వారైనా అందరూ మాహమ్మదీయులే.

తెనుగు, మరాటీ, కన్నడభాషాగ్రంథాలు నిర్ణయించవలసివచ్చాటప్పుడు, వాటిలో, ఇస్లాముకు విరుద్ధములైన విషయాలు లేకుండా చూడడానికే ఈ యేర్పాటు చెయ్యబడ్డది.

ఉర్దూలో గ్రంథాలు తర్జుమా చెయ్యడానికి ఒక ట్రాన్సులేషన్ బూరో ఏర్పడ్డది. అది ౨౦ ఏళ్లు పనిచేసి, ౨౦ లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ౨౦౦ అనువాద గ్రంథాలు ప్రకటించింది.

అనేక పారిభాషికపదాలను వురుదూలో సృష్టించింది. ఈసృష్టి అరబ్బీ పార్శీ భాషలోనుంచి దిగిందని వేరే చెప్పవలసిన పని లేదు.

---

# నారాయణరావు, పుల్లయ్యగార్ల వరవిక్రయం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౧

ఈఫిలిము, మా రాజమహేంద్రవరంలో ఆరు వారాలు నడిచింది. తక్కినచోట్లా దీని కిలాంటిఆదరగౌరవాలు జరుగుతున్నట్టే వార్తలు.

ఇది తయారు చెయ్యడానికి చాలా డబ్బు ఖర్చుపెట్టబడ్డట్టు కనపడుతుంది. దానికి తగినట్టు, దీని రాబడిన్నీ యెక్కువగానే వున్నట్టు వినబడుతున్నది.

గడపన విషయమై దీనికే కాదు, పుల్లయ్యగారి ఫిలిముల కన్నిటికీ యీశక్తి యెక్కువే. తెనుగు ఫిలిం డైరక్టర్లలో వొక్క పుల్లయ్యగారిలో మాత్రమే సమధికంగా కనపడుతున్న విశిష్టత యిది.

చాలా సంతోషం.

అయితే, పుల్లయ్యగారు డైరక్టరు మాత్రమే. ప్రొడ్యూసరు కారు; కాని యీ ఫిలిములో డైరక్షనుకు సంబంధించిన కళాదృష్టి లేశమూ కనపడ్డం లేదు. ప్రొడక్షనుకు సంబంధించిన అర్జన శక్తి మాత్రమే అతివేలంగా వున్నది.

ఈవిపర్యాసానికి కారణం ?

ఏతావతా : ఈప్రశంస ప్రస్తుతం కాదు.

పోగా, తెరమీద కూడా పుల్లయ్యగారి కంటే నారాయణరావుగారే యెక్కువ స్ఫుటంగా కనపడుతున్నారు.

అనేక నాటకసమాజాలవారు దీన్ని రంగస్థలం యెక్కించగా, పుల్లయ్యగారు తెర యెక్కించారు.

ఇంతే భేదం.

ఆరా తీసి చెప్పవలసివస్తే——చాలా దూరం దాకా నారాయణరావుగారి వెనకాతే కనపడుతూ, ఒక్కొక్కచోట వారిని